మానేరు జనత®
తెలుగు దినపత్రిక — ఇది జనం గొంతుక
15.4.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 355 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## కోల్‌కతాపై చెన్నై ఘన విజయం



## అంబేడ్కర్‌కు ప్రధాని మోడీ నివాళులు

దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి అపూర్వమని వెల్లడి




## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు

**చట్టసభల్లో వారి ఉనికి చాటేందుకు అవకాశం**

**ఎంపీలను పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని కోరండి**

**దేశ మహిళలకు లేఖలో ప్రధాని మోడీ వెల్లడి**

రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. 04



## పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు

ప్రధాని మోడీతో ట్రంప్ ఫోన్ సంభాషణ

# దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లు

**బలమైన దేశంగా ఎదగడానికి బాబా సాహెబ్ కృషి**

**తెలంగాణలో దళితులు అభ్యున్నతికి పెద్దపీట**

**దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు**

**ప్రస్తుత డీలిమిటేషన్‌తో తెలంగాణకు తీరని అన్యాయం**

**అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి**



**జనతా న్యూస్, హైదరాబాద్ :** దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేడ్కర్ పాత్ర అంతే ఉందన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు. బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేడ్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామ న్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేకపోతున్నారంటూ విమర్శించారు. గతంలో

మిగతా 2 లో

### మహిళా బిల్లుతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

మహిళా బిల్లులను తక్షణమే అమలు చేయాలి

డీ లిమిటేషన్‌పై విస్తృత చర్చ జరపాలి

ప్రధాని మోడీకి సీఎం రేవంత్ బహిరంగ లేఖ



## అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఘనత కేసీఆర్‌దే

**గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోంది**

**అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ నేత కేటీఆర్**

బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదన్న శ్రీశ్రీ చెప్పిన మాట నిజం అయిందని.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. 03

### భారత ప్రజాస్వామ్య పటిష్టతకు అంబేడ్కర్ కృషి

ఆయన రాజ్యాంగంతో ఐక్యంగా దేశం అభివృద్ధి

జయంతి వేడుకల్లో మాజీమంత్రి హరీష్ రావు

## ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?

లక్ష్మణ్ వలసపోయరాని విమర్శలా

**ఇందిర,రాహుల్, ప్రియాంక ఎక్కడ పోయారు**

**ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు సృష్టిస్తారా**

**రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 03



## బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

కొత్త సీఎంగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలుడు

10 మంది కార్మికులు మృత్యువాత

.. వివరాలు 4లో

## రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వం

దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్

రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం

అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు

విపక్షాల తీరుపై మండిపడ్డ భట్టి విక్రమార్క



03

దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది.

# దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లు

మొదటి పేజీ తరువాయి

భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేక పోతున్నారంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని

తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధారంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేడ్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ



ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం అని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# సమ్మె యోచన విరమించండి

**మా తలుపులు తెరిచే ఉన్నాయి**

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి**



**హైదరాబాద్,ఏప్రిల్14 :** ఆర్టీసీ పరిరక్షణ – ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని సంస్థ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

సమస్యలు చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయి.. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చునని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ డిమాండ్ల నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళు_న్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్థరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపి వేస్తామని స్పష్టం చేసింది. 22వ తేదీ తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెళ్తామని పేర్కొంది. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ

శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని స్పష్టం చేశారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖ మాత్రం వచ్చిందన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని ఈ సందర్భంగా యాజమాన్యం స్పష్టం చేసిందని చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పైవిధంగా స్పందించారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**అప్రమత్తంగా ఉండాలని సీతక్క హెచ్చరిక**



**హైదరాబాద్,ఏప్రిల్14 :** రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. ఉదయం 9 దాటితే బయటకు రావడం కష్టంగా మారింది. ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఎండదెబ్బ ప్రమాదమని.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. అలాగే, ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పనిస్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో ఆయా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ సీరియస్

**ముగ్గురు పంచాయితీ కార్యదర్శుల సస్పెన్షన్**

**నాగర్‌కర్నూల్,ఏప్రిల్14 :** నాగర్ కర్నూల్ జిల్లాలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సస్పెండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ మార్గదర్శకాలను పాటించకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ, విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వంగూరు మండలం పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎ÷ం పంచాయతీ కార్యదర్శి పి.కిషన్, కొల్లాపూర్ మండలం పరిధిలోని సింగోటం గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎఎఎ పంచాయతీ కార్యదర్శి పి. అర్జునయ్య, అలాగే కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎఎఎ పంచాయతీ కార్యదర్శి ఆర్. ప్రేమచంద్‌లను విధుల నుండి సస్పెండ్ సస్పెండ్ చేశారు. అదేవిధంగా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా వంగూరు, కొల్లాపూర్ మండలాల పంచాయతీ అధికారులకు షోకాస్ నోటిసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలు

**ముఠా గుట్టురట్టుచేసిన పోలీసులు**

**హైదరాబాద్,ఏప్రిల్14 :** విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలు చేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు . ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా విదేశీ ఉద్యోగాల ప్రచారం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. ఎటువంటి అనుమతులు లేకుండా ఓవర్సీస్ కన్‌స్టలెన్సీలను నడుపుతూ గ్రీస్, ర-ంమేనియా దేశాల్లో ఉద్యోగాల పేరుతో లక్షలు దండుకుంటున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ట్రివియల్ చాప్టర్ సంస్థకు చెందిన నిరుపమ, అరుణ్ రాజ్ లను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రీస్, రొమేనియా ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి రూ.50 వేల నుంచి రూ4 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. బాధితులను నమ్మించేందుకు నకిలీ వర్క్ ఆథరైజేషన్ లెటర్ ఇస్తూ మోసం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండానే ఓవర్సీస్ కన్‌స్టలెన్సీ నడుపుతున్న ఈ ముఠా.. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా విదేశీ ఉద్యోగాల ప్రచారం చేస్తూ నిరుద్యోగులను ఆకర్షిస్తున్నారు. ఈ కేసులో మరో 8మంది నిందితులకోసం గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు. ఇప్పటికే కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఈ ముఠాపై పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. విదేశాల్లో ఉద్యోగ ఆఫర్లు నకిలీవో, ఒరిజినల్ వో పోర్టల్‌లో ఏజెంట్ల వివరాలు చెక్ చేసుకోవాలని నిరుద్యోగులకు పోలీసులు సూచిస్తున్నారు.

# మహిళా బిల్లుతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

**మహిళా బిల్లులను తక్షణమే అమలు చేయాలి**

**డీ లిమిటేషన్‌పై విస్తృత చర్చ జరపాలి**

**ప్రధాని మోడీకి సీఎం రేవంత్ బహిరంగ లేఖ**

**హైదరాబాద్,ఏప్రిల్14 :** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తుంది. తక్షణమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలి. పెంచాలనుకుంటున్న 272 లోక్‌సభ సీట్లలో 50 శాతం అంటే..136 ప్రోరేటా(జనాభా ప్రాతిపదికన), మిగిలిన 50శాతం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థికవృద్ధి రేటు ఆధారంగా పునర్విభజన చేయాలని రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేయకూడదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ తన లేఖలో మహిళా రిజర్వేషన్లకు దేశవ్యాప్తంగా విస్తృత మద్దతు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో మహిళా కోటాను తక్షణమే అమలు చేస్తే, దేశమంతా స్వాగతిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆందోళనలు వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేపడితే.. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ తాత్కాలికంగా కొన్ని రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా బీజేపీకి లాభం చేకూర్చవచ్చని.. కానీ దీర్ఘకాలంలో దేశానికి నష్టం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. పార్టీ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. లోక్‌సభ డీలిమిటేషన్ విషయంలో కేవలం జనాభా నిష్పత్తి ఆధారిత విధానాన్ని కాకుండా.. ఇతర ప్రత్యామ్నాయ నమూనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను గౌరవిస్తూ జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ తన లేఖలో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాలని ప్రధాని మోడీని కోరారు.

# ఇంకా అజ్ఞాతంలో కేవలం నలుగురు మావోయిస్టులు

**గణపతి, సంతోష్,రత్నాబాయి, వార్త శేఖర్**

**తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి**



**హైదరాబాద్,ఏప్రిల్14 :** తెలంగాణాకి చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది.సాయుధ పోరాటం విరమించి.. జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణా ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలను మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే.మరోవైపు సోమవారం కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎల్ఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు. మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా రూపీ రెడ్డి ఉన్నారు. ఆమెపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఈ మృతదేహం ఆమె స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# అక్రమ గ్రానైట్ దందాపై కొరడా

**రవాణా చేస్తున్న పలు వాహనాల సీజ్**

**కరీంనగర్,ఏప్రిల్14 :** కరీంనగర్ జిల్లాలో అక్రమ మైనింగ్ పై పోలీసులు కొరడా ఝులిపించారు. అక్రమంగా గ్రానైట్ రవాణ చేస్తున్న పలు వాహనాలను సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ బ్లాక్ దందా చేస్తున్నట్లు గుర్తించారు. అక్రమ గ్రానైట్ రవాణాపై మైనింగ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వస్తున్న ఆరోపణల క్రమంలో తనిఖీలు చేపట్టారు పోలీసులు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోన పలు గ్రానైట్ తరలిస్తున్న లారీలను ఆపి చెక్ చేశారు పోలీసులు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ బ్లాక్ దందా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. వారంరోజుల్లో 20 వాహనాలను సీజ్ చేశారు. వాహనాల ఓవర్ లోడ్, అనుమతులు లేకుండా రవాణా, జీఎస్టీ చెల్లించని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు సీజ్ చేయడంతో పోలీస్ స్టేషన్ కు క్యూకట్టారు గ్రానైన్ వ్యాపారులు. అక్రమంగా జరుగుతున్న గ్రానైట్ రవాణాపై మైనింగ శాఖ చూసి చూడనట్టు వ్యవహరిస్తోందని ఆరోపణలు వస్తున్న క్రమంలో కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. విదేశాలకు ఎగుమతి చేస్తున్న గ్రానైట్ పై నిఘా పెట్టారు.

# పోలీస్ వాహనం ఢీకొని ఏఎస్ఐ మృతి

**డ్రైవర్ పరార్‌తో అనుమానాలు**

**సంగారెడ్డి,ఏప్రిల్14 :** మానూర్ మండల కేంద్రంలో ఘోరప్రమాదం జరిగింది. ఏఎస్ఐ గోవింద్ నాయక్ ప్రమాదవశాత్తూ మృతిచెందారు. పోలీస్ స్టేషన్ ఎదుట నిలుచున్న అతనిపైకి పోలీస్ వాహనమే దూసుకెళ్లింది. ఏఎస్ఐకి తీవ్రగాయాలు అవ్వగా.. తోటి సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తీవ్రగాయాలతో చికిత్సపొందుతూ గోవింద్ ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఏఎస్ఐ మరణం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీస్ వాహనం నడిపిన డ్రైవర్, హోమ్ గార్డ్ రామారావు ఘటన తర్వాత పరారయ్యాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గోవింద్‌పై హోమ్ గార్డు కక్ష పెంచుకుని వాహనంతో ఢీకొట్టి హత్య చేశాడని ఆరోపిస్తున్నారు. ఏఎస్ఐ మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 15 ఏప్రిల్ 2026


# అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఘనత కేసీఆర్‌దే

## గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోంది
## అంబేద్కర్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్,ఏప్రిల్14 :** బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదన్న శ్రీశ్రీ చెప్పిన మాట నిజం అయిందని.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి సంకెళ్లు వేసి బందీ చేసిందని ఆరోపించారు. ఈసారి బందీ చేస్తే సంకెళ్లు బద్దలు కొడతామని పిలుపు ఇచ్చిన వెంటనే విగ్రహాన్ని ఓపెన్ చేశారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ తత్వం 'బోధించు, సమీకరించు, పోరాడు'తోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని కేటీఆర్ పేర్కొన్నారు. గురుకులాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుంటోంది తప్ప.. ఎన్నడూ నిజమైన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వలేదన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయకుండా ఆయనను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు లాంటి పథకాలను తీసుకొచ్చిన కలేజా ఉన్న నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో అవకాశాలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని మాజీ మంత్రి విమర్శించారు. లక్షన్నర కోట్ల కాంట్రాక్టుల్లో 72 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసి కాంట్రాక్టు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తారా అని నిలదీశారు. కాంగ్రెస్ మోసాలను రాష్ట్రంలోని ప్రతి దళిత, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చేర్చి పోరాడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతాని ప్రకటించారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌పై బహిరంగ సభలు నిర్వహించేలా ఎ÷-లాన్ చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని బీజేపీని డిమాండ్ చేశామని.. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు ఏ మాత్రం గౌరవం ఉన్నా స్పందించే వారన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అని.. అంబేద్కర్ అంటే గిట్టని వారే అని విమర్శించారు. అంబేద్కర్‌ను కొందరి వాడుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని.. మహాత్మా గాంధీ లాగే అంబేద్కర్ అందరి వాడని స్పష్టం చేశారు. 'జై భీమ్, జై కేసీఆర్, జై తెలంగాణ' నినాదాలతో ముందుకు సాగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వం



## దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్
## రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం
## అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు
## విపక్షాల తీరుపై మండిపడ్డ భట్టి విక్రమార్క

**ఖమ్మం,ఏప్రిల్14 :** దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా కాంగ్రెస్ కార్యాయలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంటే రైతులకు ఆ మేలు జరగకూడదని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు. పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో ప్రతిపక్షాల నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషిచేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేద్దామని సూచించారు. పార్టీకోసం కష్టపడిన వాళ్లకి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# భారత ప్రజాస్వామ్య పటిష్టతకు అంబేద్కర్ కృషి

## ఆయన రాజ్యాంగంతో ఐక్యంగా దేశం అభివృద్ధి
## జయంతి వేడుకల్లో మాజీమంత్రి హరీష్ రావు



**సిద్దిపేట,ఏప్రిల్14 :** ప్రపంచంలోనే భారత్ అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉందంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తి వల్లేనని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు ముక్కలవుతున్నాయని, అంతర్గత యుద్ధాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో 28 రాష్ట్రాలు ఉన్నా దేశం ఒక్కటిగా వర్ధిల్లుతుందన్నారు. అందుకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం తడకపల్లిలో బాబాసాహెబ్ విగ్రహాన్ని హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కొందరివాడు కాదని.. అందరి వాడని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ..'చాలా దేశాలు విడిపోతున్నాయి. అంతర్యుద్ధాలతో సతమతమవుతున్నాయి. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా దేశం ఒక్కటిగానే ఉంది. అందుకు అంబేద్కర్ మహానుభావుడే కారణం. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు ఓటు హక్కు రావడానికి చాలా దశాబ్దాలు పట్టింది. కానీ, మన రాజ్యాంగంలో మహిళలు, పురుషులు, కోటీశ్వరులు, పేదవారనే తేడా లేకుండా అంబేద్కర్ అందరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి నాంది పలికారని గుర్తు చేశారు. ఆయన చాలా పేద కుటుంబంలో జన్మించారు. యువత బాబాసాహెబ్‌ను చూసి స్ఫూర్తి పొందాలి. అణగారిన వర్గాల కోసం ఆయన కృషి చేశారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ పెట్టి రెండున్నర ఏళ్లయినా ఒక్క హామీ అమలు చేయలేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక మధ్యలోనే చదువులు ఆగిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్‌ను డమ్మీ చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ఆగిపోయింది. సెక్రటేరియట్‌కి అంబేద్కర్ పేరు పెట్టాం. దేశంలో ఏ రాష్ట్రం అలా చేయలేదు. అంబేద్కర్ ఆలోచనతోనే తెలంగాణ వచ్చింది. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ పెట్టారని రేవంత్ రెడ్డి ఆ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయడం లేదని అన్నారు.

# పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ

## కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి
## కెటిఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
## కాంగ్రెస్ కమిటీ బాధ్యత స్వీకారంలో పిసిసి చీఫ్



ఖమ్మం,ఏప్రిల్14(ఆర్ఎన్ఎ): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్మార్గమైన పరిపాలన చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని.. ఆయన పాదయాత్ర కాదని.. ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్.. అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు మీ చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఈ మేరకు మాజీ మంత్రి కేటీఆర్‌పై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని.. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవు తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో మీ దోపిడీ ఎంతో.. మీ చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చిమాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్‌కి ఎప్పుడూ అండగా నిలిచిందని ఉద్ఘాటించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహ రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు. ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా వారికి నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే.. కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కులగణన చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు. భట్టివిక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నిక కాదని.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తాము నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?

## లక్ష్మణ్ వలస
## పోయరాని విమర్శలా
## ఇందిర,రాహుల్, ప్రియాంక ఎక్కడ పోయారు
## ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు సృష్టిస్తారా
## రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ,ఏప్రిల్14 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడొద్దని, వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ అని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవంగా టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులుగా ఉన్నారని ప్రస్తావించారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పని చేశారని, తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే, రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కి అధికారికంగా కోశాధికారిగా పని చేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్, జీడీపీ పరంగా సీట్లు పెరగాలని అంటున్నారని, ప్రపంచలో ఇది ఎక్కడ లేదని అన్నారు. అలాంటప్పుడు అసెంబ్లీ సీట్లు ఆదిలాబాద్, ఖమ్మంలో తగ్గిస్తారా.. అని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్‌లో మాత్రమే సీట్లు పెంచుతారా..అనేది రేవంత్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. 70 శాతం రెవెన్యూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే వస్తోందని తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ తర్వాత అంతటి మేధావి రేవంత్ రెడ్డినేనని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# ఎయిర్‌పోర్టుల నిర్మాణంలో తెలంగాణకు అన్యాయం

## పలుమార్లు కోరినా పట్టించుకోని కేంద్రప్రభుత్వం
## పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి,ఏప్రిల్14(ఆర్ఎన్ఎ): తెలంగాణకు కేంద్రం ఎలాంటి నిధులు మంజూరు చేయాడంలేదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. కొత్త విమానాశ్రయాల గురించి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని.. ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 9 విమానాశ్రయాలు ఉండగా తెలంగాణకు కేవలం ఒకటే విమానాశ్రయం ఉ ఒదని.. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంగళవారం మంథని పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి, శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావలసిన నిధుల పట్ల కేంద్ర మంత్రులు ప్రశ్నించడం లేదన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రులు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించాలని పార్లమెంట్‌లో మాట్లాడుతున్నారే తప్ప తెలంగాణ గురించి మాట్లాడడం లేదని ఆరోపించారు. రామగుండంలో సింగరేణి కార్మికుల కోసం ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. దీనిపై పార్లమెంట్లో గళం విప్పుతామని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్లు పెంచడం కొరకు పోరాటం చేస్తామని తెలిపారు. కొన్ని రోజులుగా విద్యుత్ కార్మికులు చేస్తున్న సమ్మె గురించి సీఎం రేవంత్ కి వివరించి.. వారి సమస్యలు నెరవేరే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

**కొత్త సీఎంగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక**

**నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్**



**పాట్నా :** బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహ్ కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహ్ వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహ్ కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

# ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

**వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలుడు**

**10 మంది కార్మికులు మృత్యువాత**



**రాయపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సక్తి జిల్లాలోని వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలడంతో 10 మంది కార్మికులు మృతి చెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. ఈ ఘటన అకస్మాత్తుగా బాయిలర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సంఘటన సమయంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి గల అసలు కారణాలు ఏమిటి అనే దానిపై పరిశీలన కొనసాగుతోంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం మరోసారి పారిశ్రామిక భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. భారీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# నోయిడా అల్లర్ల వెనక పాక్ హస్తం

**అల్లర్లకు పాల్పడ్డ 300 మంది కార్మికుల అరెస్టు**

**యూపి కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ వెల్లడి**

**లక్నో:** నోయిడాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన 300 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. వేతనాల పెంపు, 8 గంటల పని కోసం సోమవారం కార్మికులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. నోయిడాలోని ఫేజ్-2, సెక్టార్ 60, సెక్టార్ 62, సెక్టార్ 84 సహా పలు ప్రాంతాల్లో కార్మికులు ఆందోళనకు దిగారు. పలు వాహనాలను తగులపెట్టి.. భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. జాతీయ రహదారి -9 సహా పలు రోడ్లను దిగ్బంధించారు. దీంతో నోయిడా- ఢిల్లీ సరిహద్దుల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువులు సైతం ప్రయోగించారు. అయితే, కార్మికుల హింసాత్మక ఘటనలపై ఉత్తర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ స్పందించారు. దాడిని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హింసగా అభివర్ణించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఇటీవల నోయిడా, మీరట్‌లలో నలుగురు అనుమానితులు అరెస్టయిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నిన్నటి దాడికి పాకిస్థాన్‌తో సంబంధం ఉందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. అస్థిరతను సృష్టించే ఉద్దేశంతోనే ఈ ఘటన జరిగి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి రాజ్‌భర్ చెప్పారు. రాష్ట్రంలో అస్థిరతను సృష్టించేందుకు దేశ వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ముజఫర్‌నగర్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యక్రమానికి అంతరాయం కలిగించే కుట్రలో భాగంగానే ఈ అల్లర్లు జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కార్మికులు ప్రశాంతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు, తప్పుడు సమాచారానికి ప్రభావితం కాకూడదని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు వినేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు నోయిడాకు చేరుకుని కార్మికులతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి రాజ్ భర్ తెలిపారు.

# వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు

**చట్టసభల్లో వారి ఉనికి చాటేందుకు అవకాశం**

**ఎంపీలను పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని కోరండి**

**దేశ మహిళలకు లేఖలో ప్రధాని మోడీ వెల్లడి**



**న్యూఢిల్లీ :** రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతం పలు రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారు. అదేవిధంగా చట్ట సభల్లోనూ వారి ఉనికిని చాటేందుకే ఈ రిజర్వేషన్ల ప్రక్రియ మొదలుపెట్టాం. పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి జరగనున్న మూడు రోజుల సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' బిల్లులో సవరణలు ప్రవేశపెడతాం. దీనిపై ఏమాత్రం ఆలస్యం జరిగినా అది భారతదేశ మహిళలకు అన్యాయం చేసినట్టే. 2029 లోక్‌సభ ఎన్నికల సమయానికి మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని అంటూ దేశ మహిళలకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. భారతదేశ కుమార్తెలు వారి హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు. చట్టసభల్లో వారి గొంతుకను గట్టిగా వినిపించే సమయం వచ్చింది. దీంతో ప్రజాస్వామ్యం కూడా దృఢంగా మారనుంది. జరగబోయే పార్లమెంట్ సమావేశానికి, రాజ్యాంగ సవరణ ఆమోదం కోసం, దేశం నలుమూలలా ఉన్న కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నాను. మీరంతా మీ స్థానిక ఎంపీలకు లేఖ రాసి పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని వారిని కోరండి' అని మోదీ ఆ లేఖలో రాసుకొచ్చారు. 2023 పార్లమెంటు సమావేశాల్లో నారీ శక్తి వందనం అధినియమ్' రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన ఈ బిల్లులో సవరణలు జరుగుతున్నాయి. లోక్‌సభలో 1/3 వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని నిర్ణయించారు. అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.

**మహిళా బిల్లు, డి లిమిటేషన్‌పై 16న చర్చ**

దేశంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న వీటిని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారమిస్తూ.. సంబంధిత ప్రతులను వారికి పంపింది. నూతన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెరగనుండగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలకు పెరిగే అవకాశముంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని సమాచారం. లోక్‌సభలో దీనికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందాక కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి, సీట్ల పెంపు ప్రక్రియను పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలుచేసే దిశగా భావిస్తున్నట్టు తెలుస్తోంది.


## అంబేడ్కర్‌కు మోడీ నివాళులు

**దేశ నిర్మాణాంలో అంబేడ్కర్ కృషి అపూర్వమని వెల్లడి**

డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు. మరోవైపు అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్ర ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేడ్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయణ్ని గుర్తు చేసుకుంటున్నారు

# పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు

**ప్రధాని మోడీతో ట్రంప్ ఫోన్ సంభాషణ**



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరు సంభాషించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక సహకారం, హర్మూజ్ జలసంధిని తెరవడంపై ప్రధానంగా చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అగ్రనేతల సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది. మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయ పురోగతిని సమీక్షిం చాం. అన్ని రంగాల్లో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలో పరిస్థితులపైనా చర్చించాం. హర్మూజ్‌ను తెరవడం, సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇద్దరి నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. పశ్చిమాసియా లో నెలకొన్న పరిణామాలను ప్రధాని మోదీకి ట్రంప్ వివరించారని తెలిపారు.

# యూపిలో కార్మికుల కనీస వేతనంపై 3వేలు పెంపు

**కార్మికుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం**

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాలను రూ.3వేలు వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కనీస వేతనం పెంచాలంటూ నోయిడా , ఘజియాబాద్‌లోని కార్మికులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. నోయిడా, ఘజియాబాద్‌లలోని నైపుణ్యం లేని కార్మికుల నెలవారీ వేతనాలు రూ. 11,313 నుంచి రూ. 13,690కి పెంచింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఇతర రంగాల కార్మికులకు కూడా వేతనాలు పెంచుతున్నట్లు పేర్కొంది. అయితే, మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లాల్లో ఈ వేతన పెంపు వేరువేరుగా ఉంటుందని స్పష్టంచేసింది. ఇది తాత్కాలిక నిర్ణయం మాత్రమేనని.. వేతన మండలి సమగ్ర సమీక్ష తర్వాత దీనిపై పూర్తి నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. నోయిడాలో మంగళవారం కూడా ఆందోళనలు చెలరేగాయి. తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న కార్మికులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. వేతనాలు పెంచాలంటూ సోమవారం నోయిడాలో వేల మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. కొంతసేపటికే అవి హింసాత్మకంగా మారాయి. పోలీసుల పైకి రాళ్లు రువ్వడంతో సహా కార్లు తగలబెట్టడం, రహదారులను దిగ్బంధించడం వంటివి చోటుచేసుకున్నాయి. పరిశ్రమలోని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా హింసాత్మక ఘటలనకు పాల్పడిన 300 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. ఇక్కడ ఇటీవల పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో కొందరు వ్యక్తుల అరెస్టులు జరిగాయి. ఈ క్రమంలో తాజా ఘర్షణల్లో పాక్ ప్రమేయం ఉందేమోనన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ కార్మికశాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ పేర్కొన్నారు.

# జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌కు చెక్

**ఇకనుంచి భారీగా జరిమానా విధింపు.. నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన**

**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు విధించే జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. కొత్త నిబంధనలు ఏప్రిల్ 15 నుంచి అంటే నేటినుంచే అమల్లోకి వస్తాయి. దీని ప్రకారం.. వాహనానికి అనుమతించిన బరువు కంటే అదనంగా ఉన్న భారాన్ని బట్టి జరిమానా వసూలు చేస్తారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026ని మోర్త్ నోట్గి÷ చేసింది. 10 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు ఎటువంటి జరిమానా విధించరు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు సాధారణ టోల్ రుసుము కంటే 2 రెట్లు అధికంగా రుసుము వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్‌తో వెళితే సాధారణ టోల్ రుసుము కంటే 4 రెట్లు అధికంగా విధిస్తారు. ఓవర్‌లోడ్‌కు విధించే జరిమానాను ఫాస్టాగ్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ఎ÷-లాజా వద్ద బరువు కొలిచే ఏర్పాటు లేకపోతే ఎలాంటి రుసుములూ ఉండవు. రహదారుల భద్రతను పెంపొందించడం, రహదారి మౌలిక సదుపాయాలను రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# ఎంపి సీట్ల పెంపుతో ఉత్తరాదికే మేలు

**దక్షిణాది ప్రభావం తగ్గడం ఖాయం : సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్**

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణల కోసం కేంద్రం ఏర్పాటు చేయనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ స్పందించారు. ఈ సవరణలతో దక్షిణ భారత దేశం కంటే ఉత్తర భారత దేశానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు 63 నుంచి 65 లోకసభస్థానాలు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలకు కనిష్టంగా 200కు పైగా సీట్లు పెరుగుతాయని, దీంతో జాతీయ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816 స్థానాలకు పెంచే లక్ష్యంతో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ముందునుంచి తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు నిరసిస్తున్నాయి.

# కోల్‌కతాపై చెన్నై ఘన విజయం

## ఘోరంగా విఫలమైన బ్యాటర్లు

## రాణించిన నూర్, శాంసన్




చెన్నై: ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్(సీఎస్‌కే) వరస విజయాల జోరు కొనసాగుతున్నది. లీగ్‌లో తొలుత తడబడ్డ చెన్నై ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయంతో గాడిలో పడింది. మంగళవారం సొంతగడ్డపై జరిగిన పోరులో చెన్నై 32 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఘన విజయం సాధించింది. దిగ్గజ మహేంద్రసింగ్ ధోనీ గైర్హాజరీలో బరిలోకి దిగిన చెన్నై సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలుత సంజూ శాంసన్ (32 బంతుల్లో 48, 4ఫోర్లు, 3సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (29 బంతుల్లో 41, 4ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో చెన్నై 20 ఓవర్లలో 192/5 స్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7) మరోమారు ఘోరంగా నిరాశపర్చగా, గత మ్యాచ్ సెంచరీ హీరో శాంసన్..చెన్నైకి పెద్దదిక్కుగా మారాడు. ఆయూశ్ మాత్రె (17 బంతుల్లో 38, 6ఫోర్లు, 2సిక్స్‌లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. సీఎస్‌కే బ్యాటర్లకు మూకుతాడు వేస్తూ కోల్‌కతా స్పిన్నర్లు సునీల్ నరైన్ (1/21), అనుకూల్ రాయ్ (1/21), వరుణ్ చక్రవర్తి (3-0-26-0) పొదుపు పాటించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 160/7 స్కోరు చేసింది. రమణ్‌దీప్‌సింగ్(35), రోవ్‌మన్ పావెల్(31 నాటౌట్) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు బ్యాట్లు ఝులిపించడంలో విఫలమై స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. నూర్ అహ్మద్ (3/21), కంబోజ్ (2/26) ధాటికి కోల్‌కతా ఘోరంగా కుదేలైంది. దీంతో ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లాడిన కోల్‌కతా నాలుగింటిలో ఓడి కనీసం బోణీ కొట్టలేకపోగా, చెన్నై వరుసగా రెండో విజయంతో ఆకట్టుకుంది.

### శాంసన్, బ్రెవిస్ రాణించగా

తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా..చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. లీగ్‌లో విజయమెరుగని కోల్‌కతా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో విఫలమవుతూనే ఉన్నది. ఇప్పటికీ సరైన కాంబినేషన్ లేక చేజేతులా మ్యాచ్‌లను వదులుకుంటున్నది. చెన్నైతో మ్యాచ్‌లోనూ అదే సీన్ పునరావృతం అయ్యింది. కెప్టెన్ రుతురాజ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశామనుకున్న కోల్‌కతాకు శాంసన్, మాత్రె రూపంలో ప్రతిఘటన ఎదురైంది. లీగ్‌లో సెంచరీతో ఫామ్ అందుకున్న శాంసన్..మాత్రె జతగా కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశాడు. వైభవ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ మూడు బంతులను శాంసన్ వరుసగా బౌండరీలు కొట్టి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరో ఎండ్‌లో మాత్రె..శాంసన్‌ను అనుసరించాడు. గ్రీన్ నాలుగో ఓవర్‌లో మాత్రె రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నాడు. అదే జోరు కొనసాగిస్తూ ఆరోరా ఆరో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగిన మాత్రె..రమణ్‌దీప్‌సింగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో




శాంసన్ కూడా ఔట్ కావడంతో ఒత్తిడిలోకి వెళ్లిన చెన్నైని బ్రెవిస్ ఆదుకున్నాడు. సర్ఫరాజ్‌ఖాన్(23)తో కలిసి బ్రెవిస్ బౌండరీలతో చెలరేగాడు. మిడిల్ ఓవర్లలో కోల్‌కతా స్పిన్నర్లు కట్టుదిట్టం చేయడంతో పరుగుల రాక ఒకింత మందగించింది. లేకపోతే చెన్నై భారీ స్కోరు అందుకునేది.

### కోల్‌కతా ధమాల్

బౌలింగ్‌లో ఒకింత ఆకట్టుకున్న కోల్‌కతా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. ఓపెనర్ ఫిన్ అలెన్(1) సింగిల్ డిజిట్ స్కోరుకు పరిమితం కాగా, సునీల్ నరైన్(24), కెప్టెన్ రహానే(28), రఘువంశీ(27) క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. రింకూసింగ్(6), గ్రీన్(0) మరోమారు ఘోరంగా విఫలమయ్యారు. ఆఖర్లో రమణ్‌దీప్‌సింగ్(23 బంతుల్లో 35, 4ఫోర్లు, సిక్స్), పావెల్(22 బంతుల్లో 31 నాటౌట్, ఫోర్, రెండు సిక్స్‌లు) చెలరేగినా సాధించాల్సిన లక్ష్యం పెద్దగా ఉండటంతో గెలుపు సాధ్యం కాలేదు.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 192/5(శాంసన్ 48, బ్రెవిస్ 41, త్యాగి 2/35, నరైన్ 1/21),

కోల్‌కతా: 20 ఓవర్లలో 160/7(రమణ్‌దీప్ 35, పావెల్ 31 నాటౌట్, నూర్ 3/21, కంబోజ్ 2/32)

# టీమిండియాలోకి 15 ఏళ్ల సంచలనం

## సచిన్ రికార్డు బద్దలు కొట్టనున్న వైభవ్?

## ఐర్లాండ్ పర్యటనకు పరిశీలనలో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ





భారత క్రికెట్‌లో ఓ సంచలనం చోటుచేసుకోబోతున్నట్టు కనిపిస్తోంది. కేవలం 15 ఏళ్ల వయసుకే అద్భుతమైన ప్రతిభతో వెలుగులోకి వచ్చిన యువ కెరటం వైభవ్ సూర్యవంశీ, త్వరలో టీమిండియా సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలో జరగనున్న ఐర్లాండ్ పర్యటన కోసం బీసీసీఐ సెలక్టర్లు షార్ట్‌లిస్ట్ చేసిన ఆటగాళ్ల జాబితాలో వైభవ్ పేరు కూడా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న వైభవ్, తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై కేవలం 26 బంతుల్లో 78 పరుగులు, చెన్నై సూపర్ కింగ్స్‌పై 17 బంతుల్లో 52, ముంబై ఇండియన్స్‌పై 14 బంతుల్లో 39 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఈ అద్భుత ప్రదర్శనల నేపథ్యంలో అతడిని జాతీయ జట్టులోకి తీసుకోవాలని మాజీ క్రికెటర్లు, నిపుణులు గట్టిగా వాదిస్తున్నారు. ఈ పరిణామాలపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా స్పందించారు. భారత జట్టులోకి అతి పిన్న వయసులో అరంగేట్రం చేసే రికార్డుకు వైభవ్ అర్హుడని ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. ఇర్ఫాన్ పఠాన్, అనిల్ కుంబ్లే వంటి మాజీ దిగ్గజాలు కూడా వైభవ్‌కు జాతీయ జట్టులో చోటు కల్పించడానికి ఇదే సరైన సమయమని అభిప్రాయపడ్డారు. ఒకవేళ వైభవ్ ఐర్లాండ్ పర్యటనలో అరంగేట్రం చేస్తే, భారత క్రికెట్ చరిత్రలో కొత్త రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం భారత పురుషుల జట్టు తరఫున అత్యంత పిన్న వయసులో ఆడిన రికార్డు సచిన్ టెండూల్కర్ (16 ఏళ్ల 205 రోజులు) పేరిట ఉంది. ఓవరాల్‌గా మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ (15 ఏళ్ల 7 నెలల 27 రోజులు) ఈ రికార్డును కలిగి ఉంది. వైభవ్ అరంగేట్రం చేస్తే ఈ రెండు రికార్డులు బద్దలవుతాయి. ఐర్లాండ్, ఆ తర్వాత జింబాబ్వే పర్యటనల కోసం ద్వితీయ శ్రేణి జట్టును పంపడం ద్వారా యువ ఆటగాళ్ల సత్తాను పరీక్షించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భావిస్తోంది. "ఐర్లాండ్ పర్యటన కోసం పరిశీలిస్తున్న ఆటగాళ్ల జాబితాలో వైభవ్ పేరు కూడా ఉంది" అని బీసీసీఐ వర్గాలు తెలిపినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది. ఈ పర్యటనల తర్వాత జరిగే ఇంగ్లండ్ సిరీస్‌కు మాత్రం సీనియర్ ఆటగాళ్లను తిరిగి జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. దీంతో వైభవ్‌కు ఐర్లాండ్ సిరీస్‌లోనే అవకాశం దక్కవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఐపీఎల్ ఆటగాడిపై రెండేళ్ల నిషేధం విధించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు


ఐపీఎల్ కోసం, పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)కు చివరి నిమిషంలో దూరమైన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. పీఎస్ఎల్‌లో రెండేళ్ల పాటు ఆడకుండా అతనిపై నిషేధం విధిస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి, 29 ఏళ్ల ముజరబానీ ఐపీఎల్, పీఎస్ఎల్ వేలంలో అమ్ముడుపోలేదు. అయితే, పీఎస్ఎల్ ఫ్రాంచైజీ ఇస్లామాబాద్ యునైటెడ్ అతడిని రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా తీసుకుంది. కానీ, అదే సమయంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కూడా ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో ముజరబానీ పీఎస్ఎల్ కాకుండా ఐపీఎల్‌లో ఆడేందుకే మొగ్గు చూపాడు. ఈ పరిణామంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టిన పీసీబీ, ముజరబానీపై రెండేళ్ల నిషేధం విధించింది. ఒప్పందాలను ఉల్లంఘించడం, క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. పీఎస్ఎల్ ప్రతిష్ఠను, వృత్తిపరమైన వాతావరణాన్ని కాపాడేందుకే ఈ కఠిన చర్యలు అవసరమని పేర్కొంది. గత ఏడాది కూడా ఇలాగే ప్రవర్తించిన కార్బిన్ బాష్‌పై పీసీబీ ఏడాది పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, ముజరబానీ ఇప్పటికే కేకేఆర్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. ముజరబానీతో పాటు స్పెన్సర్ జాన్సన్, దసున్ షనక కూడా పీఎస్ఎల్ ఒప్పందాలను వదులుకుని ఐపీఎల్‌లో చేరారు. వీరిపై పీసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.



# సన్‌రైజర్స్‌కు గుడ్ న్యూస్

## తిరిగి రానున్న కెప్టెన్ పాట్ కమిన్స్

ఐపీఎల్ 2026 సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) జట్టుకు భారీ శుభవార్త అందింది. గాయం కారణంగా జట్టుకు దూరమైన రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ తిరిగి జట్టులో చేరనున్నాడు. ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ఒక రోజు ముందు, అంటే ఏప్రిల్ 17న కమిన్స్ హైదరాబాద్ రానున్నాడు. క్రిక్‌బజ్ కథనం ప్రకారం, కమిన్స్ బుధవారం స్వదేశంలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరవుతాడు. అందులో పాసైతే, అతడు తిరిగి జట్టుతో చేరి ఆడే అవకాశం ఉంది. ఈ విషయంపై ఫ్రాంచైజీ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి. "అతడు టెస్టులో పాసై, క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఎన్ఓసీ పొందుతాడని ఆశిస్తున్నాం" అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సీజన్ ప్రారంభానికి ముందు భారత్‌కు వచ్చినప్పటికీ, కమిన్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఏప్రిల్ 2న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత వెన్నునొప్పి స్కానింగ్ కోసం అతడు ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్లాడు. యాషెస్ సిరీస్ తర్వాత కమిన్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం, ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌నకు కూడా దూరం కావడం గమనార్హం. కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అతని సారథ్యంలో హైదరాబాద్ ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో రెండింటిలో గెలిచి, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్‌పై 57 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించి మంచి ఊపు మీదుంది. ఇప్పుడు కమిన్స్ రాక జట్టుకు మరింత బలాన్ని చేకూర్చనుంది.




# కోచ్ మాట.. బౌలర్ నమ్మకం

## సన్‌రైజర్స్ విజయం వెనుక అసలు కథ!

రాజస్థాన్ రాయల్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం వెనుక ఒక పక్కా వ్యూహం ఉంది. ముఖ్యంగా ఇద్దరు అరంగేట్ర బౌలర్ల ప్రణాళికాబద్ధమైన ప్రదర్శన, ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్, అరంగేట్ర బౌలర్ ప్రఫుల్ హింగే మధ్య జరిగిన ఒక చిన్న చర్చే మ్యాచ్ గతిని మార్చేసింది. రాజస్థాన్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని ఔట్ చేసేందుకు రూపొందించిన ఈ సరళమైన వ్యూహం, ఆరంభంలోనే సన్‌రైజర్స్‌కు పైచేయి అందించింది. ఈ వ్యూహం గురించి మ్యాచ్ అనంతరం బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ మీడియా సమావేశంలో వివరించారు. "అరంగేట్రం చేస్తున్న ఇద్దరు ఆటగాళ్లకు మేము చెప్పింది ఒక్కటే. మీ ఆటను ఆస్వాదించండి అని. అయితే, వైభవ్ సూర్యవంశీని తాను గతంలో ఔట్ చేశానని, మళ్లీ చేస్తానని ప్రఫుల్ హింగే ఎంతో నమ్మకంతో చెప్పాడు. ఆ నమ్మకమే అతని ప్రణాళిక. అతను రౌండ్ ది వికెట్ బౌలింగ్ చేయాలనుకున్నాడు, కానీ నేను ఓవర్ ది వికెట్ బౌలింగ్ చేయమని సూచించాను. అక్కడి నుంచే వికెట్ వస్తుందని చెప్పాను. అతని ప్రణాళిక, అతని నమ్మకానికి నేను చిన్న సాయం మాత్రమే చేశాను" అని ఆరోన్ తెలిపారు. మైదానంలో ఈ ప్రణాళిక వెంటనే ఫలించింది. తాను వేసిన రెండో బంతికే వైభవ్‌ను హింగే పెవిలియన్ పంపాడు. ఆ దెబ్బకు రాజస్థాన్ కోలుకోలేకపోయింది. అదే ఓవర్‌లో ధ్రువ్ జురెల్, ప్రిటోరియస్‌ను కూడా ఔట్ చేయడంతో రాజస్థాన్ 1 పరుగుకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. హింగే జోరు అక్కడితో ఆగలేదు. ఆ తర్వాత రియాన్ పరాగ్‌ను కూడా ఔట్ చేసి, మొత్తం నాలుగు వికెట్లతో రాజస్థాన్ బ్యాటింగ్ లైనప్ పతనాన్ని శాసించాడు. మరోవైపు మరో అరంగేట్ర బౌలర్ సాకిబ్ హుస్సేన్ కూడా తన వంతు పాత్ర పోషించాడు. కీలకమైన యశస్వి జైస్వాల్ వికెట్‌ను ఆరంభంలోనే తీశాడు. కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేసిన డొనోవన్ ఫెరీరాను కూడా ఔట్ చేసి రాజస్థాన్ పుంజుకోకుండా అడ్డుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన జోఫ్రా ఆర్చర్, రవి బిష్ణోయ్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోవడంతో రాజస్థాన్ 159 పరుగులకే ఆలౌట్ అయింది. మొత్తం మీద సన్‌రైజర్స్ అరంగేట్ర బౌలర్లు పక్కా వ్యూహంతో ఆరంభంలోనే చేసిన నష్టమే రాజస్థాన్ ఓటమిని ఖరారు చేసింది.

# అనిల్ రావిపూడి సంక్రాంతి సినిమా

## ముందే డిజిటల్ హక్కులు దక్కించుకున్న జి5

టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'హిట్ మిషన్'గా పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 2027 సంక్రాంతి బరిలోకి ఈసారి మల్టీస్టారర్ చిత్రంతో దిగేందుకు సిద్ధమవుతున్నారు.ఈ సినిమాలో వెంకటేష్, కల్యాణ్ రామ్ కలిసి నటించనుండటం విశేషం. ఈ కాంబినేషన్ పై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ల విషయానికి వస్తే, కృతిశెట్టి ఒక కథానాయికగా ఫిక్స్ కాగా, మరో కీలక పాత్ర కోసం కీర్తి సురేష్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా కాస్టింగ్ మరింత బలంగా మారుతోంది. ఇంకా షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ చిత్రం ఓటీటీ మార్కెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జిఇఇ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అనిల్ రావిపూడి గత చిత్రాలకు ఓటీటీలో వచ్చిన ఆదరణ దృష్ట్యా ఈ డీల్ రికార్డు స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు విశాఖపట్నంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రతి సినిమా స్క్రిప్ట్‌ను వైజాగ్‌లోనే పూర్తి చేసే సెంటిమెంట్ ఉన్న అనిల్ రావిపూడి, ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేసినట్లు సమాచారం.త్వరలోనే షూటింగ్ ప్రారంభించి, సంక్రాంతి సీజన్‌లో మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాలని దర్శకుడు ఎ÷-లాన్ చేస్తున్నాడు. ఫ్యామిలీ ఎంట్టంల్గ÷నర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీ, ఎమోషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. స్టార్ హీరోల కలయిక, హిట్ డైరెక్టర్ కాంబో, భారీ ఓటీటీ డీల్ అన్నీ కలిసి ఈ సినిమాను ఇప్పటినుంచే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. కాగా, అనిల్ రావిపూడి ఇప్పటి వరకు తెరకెక్కించిన అన్ని చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించిన విషయం తెలిసందే.





# టాక్సిక్ వాయిదా ర్యూమర్స్‌కు చెక్

టాక్సిక్ కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా మరోసారి వాయిదా పడనుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలను టీమ్ ఖండించింది. అనుకున్న షెడ్యూల్ ప్రకారం జూన్ 4నే సినిమా విడుదల అవుతుందని స్పష్టంచేసింది. ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడానికి కూడా సిద్ధమైనట్లు తెలిపింది. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి యశ్ ప్రచారం మొదలుపెట్టారు. అమెరికాలో జరుగుతోన్న సినిమాకాన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. 'టాక్సిక్'తో పాటు ఆయన మరో చిత్రం 'రామాయణ' గురించి కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడనున్నారు. దీంతో యశ్ టాక్సిక్ వాయిదా వార్తలకు చెక్ పడింది. ఇందులో అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు.



# నివేదా పేతురాజ్ మళ్లీ సినిమాల్లోకి!



లవ్‌స్టోరీలు, బ్రేకప్‌లు టాలీవుడ్‌లో చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ సంస్కృతి టాలీవుడ్‌లో చాలా అరుదు. బాలీవుడ్‌లో అయితే ప్రతి సినిమాలకు ఇలాంటి కథలు, స్టోరీలు వినిపిస్తూనే ఉంటాయి. డేటింగ్‌లు, బ్రేకప్‌లు అక్కడ సర్వసాధారణం. కానీ సౌత్‌లో మరీ ముఖ్యంగా టాలీవుడ్‌లో మాత్రం ఇలాంటివి చాలా అరుదు. కానీ అవి టాలీవుడ్‌లోనూ ఈ మధ్య ఎక్కువయ్యాయి. హీరోయిన్‌లు, హీరోల ప్రేమలో పడటం, పెళ్లి వరకు వెళ్లడం జరుగుతోంది. కొన్ని దశాబ్దాల క్రితం ఉన్న ఈ సంస్కృతి టాలీవుడ్‌లో మళ్లీ ఇటీలే మొదలైంది. హీరోలు ఈ మధ్య హీరోయిన్‌లని ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారు. కొంత మంది విడాకుల వరకు వెళితే మరి కొందరు ఆదర్శంగా నిలుస్తూ దేశ వ్యాప్తంగా వారి హ్యూమానిటీతో ట్రెండ్ అవుతున్నారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదిలా ఉంటే టాలీవుడ్ హీరోయిన్‌లలో కొంత మంది ఇండస్ట్రీకి సంబంధం లేని వారిని ప్రేమించి మెహ్రీన్ లాంటి వాళ్లు పెళ్లి దాకా వెళ్లి దాన్ని రద్దుచేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇప్పుడు అదే జాబితాలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా చేరింది. దుబాయ్ బేస్డ్ బిజినెస్ మేన్ రజిత్ ఇబ్రాన్‌తో కొంత కాలం ప్రేమలో ఉన్న నివేదా ఈ విషయాన్ని గత ఏడాది ఆగస్టులో సోషల్ మీడియా వేదికగా వెల్లడించి ఆశ్చర్యపరిచింది. అక్టోబర్‌లో నిశ్చితార్థం.. 2026లో వివాహం చేసుకోవాలని ఈ జంట ప్లాన్ చేసుకుంది అని వార్తలు వినిపించాయి. అయితే ఆ తరువాత ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ నివేదా పేతురాజ్ తన ఇన్‌స్టా ఆకౌంట్‌లో రజిత్‌కు సంబంధించిన ఫొటోలని తొలగించింది. దీంతో నిశ్చితార్థం రద్దయిందని స్పష్టమైంది. ఆ తరువాత దీని నుంచి బయటపడటం కోసం కొంత కాలం పాటు విదేశాలకు వెళ్లింది. తిరిగి వచ్చాక దుబాయ్ నుంచి చెన్నైకి మకాం మార్చింది. తను ప్రేమించిన వ్యక్తి కోసం కెరీర్‌ని కూడా పక్కన పెట్టి సినిమాలకు దూరంగా ఉన్న నివేదా పేతురాజ్ మళ్లీ సినిమాల్లో మునుపటి తరహాలోనే రాణించాలని ప్లాన్ చేసుకుంటోందట. సెకండ్ హీరోయిన్ క్యారెక్టర్‌లకు సైతం ఓకే చెప్పేయాలనే ఆలోచనతో ఉ ందని, గత మూడేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటూ వచ్చిన నివేదా మళ్లీ సినిమాల్లో బిజీ కావాలని అందరితో టచ్‌లో ఉంటోందట. ఇందు కోసం తెలుగులోనూ ప్రయత్నాలు మొదలు పెట్టినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె రీఎంట్రీకి అవకాశం ఏ హీరో, డైరెక్టర్ ఇవ్వబోతున్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. -మెంటల్ మదిలో- సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన నివేదా పేతురాజ్‌కు చిత్రలహరి, బ్రోచే వారెవరురా, అల వైకుంఠపురములో-, -దాస్ క ధమ్కీ- వంటి సినిమాలు మంచి పేరు తెచ్చి పెట్టాయి.

# నేపాలీ అమ్మాయిని.. పూణెలో పుట్టా!

ఇండస్ట్రీలో కొత్తగా వినిపిస్తున్న పేర్లలో ఇప్పుడు ముందు వరుసలో నిలుస్తోంది కయాదు లోహర్. టాలీవుడ్ మాత్రమే కాకుండా మొత్తం సౌత్ సినీ పరిశ్రమలో ఈ యంగ్ హీరోయిన్ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటూ దూసుకుపోతోంది. ఇటీవల ఆమె వ్యక్తిగత గుర్తింపు గురించి సోషల్ మీడియాలో వచ్చిన చర్చలకు కయాదు స్వయంగా ఇచ్చిన సమాధానం మరింత ఆకర్షణగా మారింది. తాను నేపాలీ అని, కానీ పూణెలో పుట్టి పెరిగానని, తమ పెద్దలు అస్సాంలో సెటిలయ్యారంటూ తన మూలాలు, పెంపకం గురించి స్పష్టంగా చెప్పింది. ఈ క్లారిటీ ఆమె వ్యక్తిత్వాన్ని మరింత బలంగా చూపించిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, సినిమాల పరంగా కూడా కయాదు కెరీర్ ఆసక్తికర మలుపు తిరిగింది. తెలుగులో ఆమె నటించిన ఫంకీ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఫంకీ ఫ్లాప్ తర్వాతే కయాదుకి మరింత గుర్తింపు రావడం గమనార్హం. ఇండస్ట్రీలో ఒకప్పుడు అవకాశాల కోసం ఎదురుచూసిన ఈ బ్యూటీ, ఇప్పుడు స్టార్ దర్శకులు, నిర్మాతలు ఆమె డేట్స్ కోసం వెయిట్ చేసే స్థాయికి చేరుకుంది. అస్సాం నుంచి వచ్చి తక్కువ కాలంలోనే సౌత్‌లో గుర్తింపు తెచ్చుకోవడం ఆమె కెరీర్‌లో ప్రత్యేకమైన అంశంగా చెప్పాలి. కయాదు కెరీర్లో ప్రదీప్ రంగనాథన్ సరసన చేసిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా కీలక మలుపుగా నిలిచింది. ఆమె కెరీర్ ను ఈ సినిమాకు ముందు, తర్వాతగా విభజించవచ్చని చెప్పొచ్చు. బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా ద్వారా ఆమె నటనకు యూత్ నుంచి విపరీతమైన స్పందన లభించింది. అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని కయాదు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాతో వచ్చిన క్రేజ్ కారణంగా ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం సౌత్‌లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరిగా కయాదు ఎదిగింది.

# చలివేంద్రంతో ప్రజలకు చల్లని ఉపశమనం

## గొల్లపల్లి బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం ఘనంగా ప్రారంభం

గొల్లపల్లి, ఏప్రిల్ 15: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో గొల్లపల్లి బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎల్లారెడ్డిపేట ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. లయన్ కోట సతీష్ (మెల్విన్ జోన్స్ ఫెలో గౌరవ పురస్కార గ్రహీత) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమం ప్రజల ప్రశంసలు అందుకుంది. ప్రతి సంవత్సరం తన తాతగారైన కోట మల్లయ్య జ్ఞాపకార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ వస్తున్న లయన్ కోట సతీష్ సేవాభావాన్ని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. మండుతున్న ఎండల్లో ప్రయాణికులకు చల్లని నీరు, మజ్జిగ అందించడం ద్వారా ఆయన సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ కార్యక్రమం సందర్భంగా పులిహోర, మజ్జిగలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొలనూరి శంకర్, ట్రెజరర్ రావుల ముత్యం రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ కోట సతీష్ , క్లబ్ సభ్యులు నంది కిషన్, ముత్యాల శ్రీనివాసరెడ్డి, పయ్యావుల రామచంద్రం, సద్ది లక్ష్మారెడ్డి, గొర్రె మల్లేష్, పార్టీ దేవయ్య, మద్దివేని లక్ష్మణ్, కోట రాజేశం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్, కొండ ఆంజనేయులు, చీటి లక్ష్మణరావు, గుర్రాల రాజు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని, మరింత మంది సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పలువురు కోరారు.







# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



తిమ్మాపూర్, జనతా న్యూస్ తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నవభారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు తిమ్మాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ భవనంలో మండల అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. తిమ్మాపూర్ అంబేద్కర్ సంఘ భవణంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు మాతంగి లక్ష్మణ్ అధ్వర్యంలో నిర్వహించగా, మండల స్థాయి ఆఫీసుల్లో అధికారులు, ఆయా గ్రామ పంచాయతీ కార్యలయాల్లో సర్పంచులు, పాలకవర్గసభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాతంగి లక్ష్మణ్, పార్నంది జలపతి, వంతడుపుల సంపత్, బోయిని కొమురయ్య, మాతంగి శంకర్, కనకం రాములు,

అలువాల సంపత్, గూడ కమలాకర్, కొండ్ర రాజు, గాజా సాగర్, కన్నం నరసయ్య, మురళి, అంబేద్కర్ సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

# ముసుగులు తీశారు...వేశారు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ముసుగులను

సోమవారం సాయంత్రం తీసిన అధికారులు మళ్లీ వేశారు. విగ్రహాల పరిసర ప్రాంతాలను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు అధికారులు శుభ్రం చేయించారు. సోమవారం సాయంత్రం అక్కడికి చేరుకున్న అధికారులు తిమ్మాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందితో ముసుగులను తొలగించి విగ్రహాలను శుభ్రం చేయించారు. రాత్రి వరకు ఉన్న అధికారులు, అంబేద్కర్ సంఘ, దళిత సంఘ నాయకులు మళ్లీ మహనీయుల విగ్రహాలకు ముసుగులు వేసి వెళ్ళిపోయారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం విగ్రహాలను ఆవిష్కరించి జయంతి వేడుకలను నిర్వహిస్తారని అందరూ భావించారు. అంబేద్కర్ జయంతి రోజున ముసుగులు తొలగించకపోవడంతో ఆవిష్కరణ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు చర్చించుకుంటున్నారు. కాగా మానకొండూర్

ఎమ్మెల్యే సత్యనారాయణ హైదరాబాదులో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కారణంగానే తిమ్మాపూర్ మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే విగ్రహాల ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని సుందరీకరణ చేసిన తర్వాత ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటామని అంబేద్కర్ సంఘ నాయకులు చెబుతున్నారు. ముసుగులు వేసే కార్యక్రమంలో తిమ్మాపూర్ తాసిల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

# మహనీయుడిని స్మరించుకున్న బెజ్జంకి మండల ప్రజలు







మండల కేంద్రంతో పాటు , వివిధ గ్రామాలలో ఘనంగా బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు. పలు గ్రామాలలో దళిత సంఘాల నాయకులు , ఉత్సవ కమిటీ కార్యవర్గం సమన్వయంతో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బేగంపేట లో గ్రామపంచాయతీ పాలకవర్గం , గ్రామ ప్రజల సహకారంతో అంబేద్కర్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. జనత న్యూస్ బెజ్జంకి : భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ, జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంతో పాటు , మండలంలోని వడ్లూరు, బేగంపేట, గూడెం, లక్ష్మీపూర్, వీరాపూర్, దాచారం, గాగిల్లాపూర్ , కల్లేపల్లి , చిలాపూర్ మొదలగు గ్రామాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల సర్పంచులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను, ఆయన సమాజంలో ఎదుర్కొన్న వివక్షతలను ప్రజలకు వివరించి మహనీయుడిని స్మరించుకున్నారు. బేగంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఏల విజయ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం కాదని , ప్రతి సామాజిక వర్గ హక్కుల కోసం ఆయన పరితపించారని, వివక్షత లేని సమాజం కోసం నిరంతరం శ్రమించారని, అనేక వివక్షతలను , చిదరింపులను తట్టుకొని భారత దేశ ప్రజలకి, కానీ విని ఎరుగని రీతిలో భావితరాలకు ఉపయోగపడే మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు, అంబేద్కర్ సంఘాల సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్

### హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి



చిగురుమామిడి,జనత న్యూస్: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. శివుడికి మూడు కన్నులు ఉన్నట్టే, అంబేద్కర్ తన అపారమైన జ్ఞాననేత్రంతో సమాజాన్ని దర్శించారని కొనియాడారు. కళ్లు తెరిస్తే ఎదురుగా ఉన్నవారు మాత్రమే కనిపిస్తారని, కానీ కళ్లు మూసుకుంటే ప్రపంచం ఎక్కడున్నా, ఏ దేశంలో ఉన్నా అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోగల మనోనేత్రం ఆయన సొంతమని పేర్కొన్నారు. ఆ అసాధారణ మేధస్సుతోనే భారత రాజ్యాంగాన్ని రచించి, అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చారని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా, భావితరాల బాగుకోసం పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన నిరంతరం తపస్సు చేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా చదువుకు దూరంగా ఉన్నవారు, ఆర్థికంగా వెనుకబడిన వారు, ఊరికి దూరంగా నెట్టివేయబడిన వారి విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు బాబాసాహెబ్ అని కీర్తించారు. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికో, కులానికో పరిమితమైన వారు కాదని, ఆయన ఒక గొప్ప విద్యావేత్తగా ఎదిగి యావత్ భారతావనికే గర్వకారణంగా నిలిచారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జంగా శిరీష, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎనగందుల సంపత్, ఉప సర్పంచ్ మెడబోయిన రాజు, ఏఎంసీ డైరెక్టర్ ఓరుగంటి భారతీదేవి, మాజీ సర్పంచ్ లు వంతడ్పుల వెంకటస్వామి, శ్రీ మూర్తి రమేష్, నాయకులు రామోజీ కృష్ణమాచారి, ఎనగందుల లక్ష్మణ్, కొమ్ము కొమురయ్య, ఎనగందుల సురేందర్, వంతడుపుల కనకయ్య, వంతడ్పుల దిలీప్ కుమార్, పెసరి శ్రీనివాస్,వి శ్రావణ్ కుమార్, మంతెన మహేందర్, వార్డు సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికే అంబేద్కర్ కృషి

### సముద్రాలలో ఘనంగా 135వ జయంతి వేడుకలు



హుస్నాబాద్,జనత న్యూస్: సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం తన జీవితాంతం పోరాడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని జాతీయ మాలమహానాడు సిద్దిపేట జిల్లా బాధ్యులు ఆరె కిశోర్ కొనియాడారు. హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం సముద్రాల గ్రామంలో జాతీయ మాలమహానాడు గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ 135వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆరె కిశోర్, విశ్రాంత ఆర్టీసీ కంట్రోలర్ ఆరె వెంకటయ్యలతో కలిసి గ్రామస్తులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ.. అంటరానితనం లేని సమాజం కోసం అంబేద్కర్ చేసిన కృషి అపారమని, బరోడా మహారాజు సాయంతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించదగ్గ మహామేధావిగా ఎదిగారని పేర్కొన్నారు. కేవలం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల్లోనే ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించి భారతావనికి అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా మహిళా హక్కుల పరిరక్షణ కోసం న్యాయశాఖ మంత్రి పదవికి సైతం రాజీనామా చేసిన అరుదైన నాయకుడు అంబేద్కరని కొనియాడారు. కార్మికుల సంక్షేమం,చేతివృత్తిదారుల అభ్యున్నతి కోసం ఆయన అనేక చట్టాలను తీసుకువచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు గ్రామ శాఖ అధ్యక్షుడు ఆరె ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆరె శ్రీనివాస్, ఆరె లక్ష్మయ్య, ఆరె రామవ్వతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**హుస్నాబాద్ ఏసీపీ సదానందం**



హుస్నాబాద్,జనత న్యూస్: రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవడం వల్ల ప్రమాద సమయాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని ఆయన హెచ్చరించారు. అనంతరం వాహనదారులు, స్థానిక ప్రజలతో కలిసి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

**పోలీసుల చొరవ: మిర్జాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గుంతల పూడ్చివేత**

కేవలం అవగాహన సదస్సులకే పరిమితం కాకుండా, ప్రయాణీకుల ఇబ్బందులను గమనించిన పోలీస్ శాఖ ఆచరణలోనూ ముందుంటోంది. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన మిర్జాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎత్తుపల్లాలు, గుంతలను పోలీసులే దగ్గరుండి గ్రావెల్‌తో చదును చేయించారు. పోలీసుల ఈ చొరవ పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**విద్యతోనే సామాజిక మార్పు : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



కరీంనగర్, ఏప్రిల్ 15: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే, జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.

మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, అంబేద్కర్ చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రపంచ మేధావిగా నిలిచారని తెలిపారు. వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, అన్ని వర్గాలకు మేలు చేసేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని అంబేద్కర్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. పిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ వంటి కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.

కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. యువత అంబేద్కర్ జీవిత చరిత్రను చదవాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, "జుංబఝేవ -- ౯ాతీ-స్త్రుఅఱఓవ" అనే అంబేద్కర్ సందేశాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. చదువే అన్ని సమస్యలకు పరిష్కారమని, అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, బలహీన వర్గాల అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ అందరివాడని, ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం భీమ్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఆర్డీవో మహేశ్వర్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సుకన్య కౌంటర్ల వద్ద అల్లకల్లోలం

**ఏప్రిల్ 3 నుంచి అదుపు తప్పిన రద్దీ... ప్రజల తీవ్ర ఆగ్రహం**

**కరీంనగర్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నిర్వహణపై విమర్శలు**

కరీంనగర్, ఏప్రిల్ 15: కరీంనగర్ హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన కౌంటర్ల వద్ద గత ఏప్రిల్ 3వ తేదీ నుంచి భారీ రద్దీ నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో కౌంటర్ల ముందు భారీ క్యూ లైన్లు ఏర్పడి, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. లైన్లలో నిల్చున్న ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని, కొన్నిచోట్ల వాగ్వాదాలు, తోపులాటలు జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిబ్బంది కొరత, టోకెన్ వ్యవస్థ లేకపోవడం, క్యూ లైన్ నిర్వహణలో లోపాలు వంటి కారణాలతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజురోజుకు రద్దీ పెరుగుతున్నప్పటికీ, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాగే పరిస్థితి కొనసాగితే ఎప్పుడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందిని పెంచి, క్యూ లైన్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

# సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్

**ప్రపంచం మెచ్చిన మహానేతకు ఘన నివాళులు**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్, ఏప్రిల్ 15: సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, ప్రపంచం మెచ్చిన మహానేత, భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు. బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి గంగాడి కృష్ణారెడ్డి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ కేవలం గొప్ప నాయకుడు మాత్రమే కాకుండా సమాజాన్ని మార్గదర్శనం చేసిన మహోన్నత సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలు, కుల వివక్షను ఎదుర్కొన్నప్పటికీ, విద్యనే ఆయుధంగా చేసుకుని ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించి, భారత రాజ్యాంగానికి ప్రధాన రూపకర్తగా నిలిచారని తెలిపారు. అంబేద్కర్ సమాజంలో సమానత్వం కోసం నిరంతరం పోరాడారని, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలని ఆయన ఆశయమని అన్నారు. మహిళల హక్కులు, కార్మికుల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు.

దేశం ప్రజాస్వామ్య పథంలో ముందుకు సాగడానికి అంబేద్కర్ చేసిన కృషి అమూల్యమని పేర్కొంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సోమిడి వేణు ప్రసాద్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు






హుస్నాబాద్,జనత న్యూస్:భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను హుస్నాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి,వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, అంబేద్కర్ యువజన సంఘ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, కుల వివక్ష లేని సమాజం కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారని దండి లక్ష్మి పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే నేడు సామాన్యులకు సైతం ఓటు హక్కు, స్వేచ్ఛ, సమానత్వం దక్కాయని ఆమె వివరించారు. ముఖ్యంగా మహిళా సాధికారత కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, హిందూ కోడ్ బిల్లు ద్వారా స్త్రీలకు ఆస్తి హక్కుతో పాటు అనేక హక్కులు కల్పించారని గుర్తు చేశారు. నేటి యువత అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, చదువు ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలుగుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. జయంతి వేడుకలలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గౌడ్, ఏసీబీ సదానందం, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మల్లికార్జున రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, కౌన్సిలర్ ఆకుల రజిత, వెంకన్న పూదరి వరప్రసాద్, నాయకులు వెన్న రాజు, వడ్డేపల్లి వెంకటరమణ, అన్వర్ పాషా, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు



**నాలుగు పార్లమెంట్ స్థానాల్లో ఓడించాలని పిలుపు**

**బీఎస్పీ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**

కరీంనగర్, ఏప్రిల్ 15: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై బీఎస్పీ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం తీవ్ర విమర్శలు చేశారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా ఈ పార్టీలు పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి ఆదేశాల మేరకు అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నిషాని రామచంద్రం, ముందుగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో మాట్లాడిన ఆయన, దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు అంబేద్కర్ పేరును ఉపయోగించుకుంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు రెండూ అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. భారత రాజ్యాంగంపై కొందరు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ, రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.

దేశంలో బహుజనుల హక్కులను పరిరక్షించాలంటే బీఎస్పీని బలోపేతం చేయాలని, రాబోయే ఎన్నికల్లో నాలుగు పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బీఎస్పీ రాజ్యాంగాన్ని ప్రధాన సిద్ధాంతంగా తీసుకుని పనిచేస్తోందని, బహుజనుల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు.

సభలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జమ్మికుంట నుండి అంబాలా ప్రభు ఆధ్వర్యంలో వచ్చిన డప్పు కళాబృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదిలాబాద్ నుంచి కరీంనగర్ వరకు సైకిల్ యాత్ర చేసిన రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

ఈ సభకు నల్లాల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, జోన్ ఇంచార్జ్‌లు మాతంగి అశోక్, ఎనగందుల వెంకన్న, నీరడి ఈశ్వర్, గైని గంగాధర్, పల్లె ప్రశాంత్ గౌడ్, పార్లమెంట్ ఇంచార్జ్‌లు కళ్లేపల్లి రాజేందర్, దొడ్డ సమ్మయ్య, బోయిని బాబు, నీరడి లక్ష్మన్, సాలం బిన్ హాసాన్, తుడిచర్ల సంజీవ్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com